క్లుప్తంగా

నేడు మంత్రి రాక

కందుకూరు: మండల పరిధి సార్లరావులపల్లిలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడానికి మంత్రి సబితారెడ్డి ఆదివారం రానున్నట్లు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటలకు కార్యక్రమం ఉంటుందని, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

మహేశ్వరంలో..

మహేశ్వరం: మండల పరిధి తుమ్మలూరు, గంగారం, రామచంద్రగూడ, పెండ్యాల, కల్వకోల్, దుబ్బచర్ల, దిల్‌వార్‌గూడ, కోళ్లపడకల్, పోరండ్ల, నాగిరెడ్డిపల్లి, నాగిరెడ్డిపల్లి తండాల్లో ఆదివారం మంత్రి సబితారెడ్డి పర్యటించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం చేయనున్నారని ఇన్‌చార్జి ఎంపీపీ రాత్లావత్ సునీత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న రాజుగుప్తా

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ మండల ఆర్య వైశ్య మహాసభ మీడియా కమిటీ చైర్మన్‌గా కాకొళ్ల రాజుగుప్తను నియమించారు. ఈ మేరకు శనివారం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశం గుప్తా, మండల అధ్యక్షుడు పద్మారాముగుప్తా నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలి పారు.

అల్పాహారం పరిశీలన



అల్పాహారం పరిశీలిస్తున్న అధికారులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధి రావిర్యాల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారాన్ని శనివారం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ వడ్డించారు. ఇందులో తహసీల్దార్ మహ్మద్‌అలీ, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్, ఎంఈఓ కృష్ణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

గణనీయంగా పెరిగిన ఓటర్లు

- తుదిజాబితా విడుదల చేసిన అధికారులు
- 5,17,241 చేరుకున్న సంఖ్య

తుక్కుగూడ: మహేశ్వరం నియోజకవర్గం ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఓటర్ల తుది జాబితను అధికారులు తాజాగా ప్రకటించారు. 2014 శాసనసభ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య 4,03,719 ఉండగా.. 2018 ఎన్నికల నాటికి ఆ సంఖ్య 4,23,261కి పెరిగింది. ప్రస్తుతం 5,17,241 చేరింది. కొత్తగా చేరిన వారితో 23,698 చేరుకుంది. అత్యధికంగా బాలాపూర్ మండలంలో 2,83,600 ఉండగా, అత్యల్పంగా కందుకూరు మండలంలో 49,110 మంది ఓటర్లు ఉన్నారు. బాలాపూర్ మండలం నగర శివారులో ఉంటడంతో ఎక్కువ మంది ఇక్కడ స్థిరపడ్డారు. నియోజకవర్గంలో పురుషులు, 2,66,628, మహిళలు 2,50,546, ఇతరులు 67 మంది ఓటర్లు ఉన్నారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కందుకూరు: ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ముదిరాజ్ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 3 గంటలకు సికింద్రాబాద్ పేరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న సభకు సీనియర్ రాష్ట్ర నాయకులు కుర్నమోని జయేందర్ ముదిరాజ్, ఎడ్ల బాబురావు ముదిరాజ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివెళ్దామన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌ముదిరాజ్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్ ముదిరాజ్, మండల యూత్ అధ్యక్షుడు సురేందర్‌ముదిరాజ్, ఆ సంఘం నాయకులు ఉదయ్, వెంకటేశ్, మల్లేశ్, బాల్‌రాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

మంచాల: మంచాల మండల పరిధిలోని తిప్పాయి గూడ గ్రామంలో శనివారం సీసీ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామని సర్పంచ్ పాండు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అందాలు, సురేశ్, వీరేశ్ గౌడ్, చిరంజీవి, రాములు, రఘునందన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలే నా బలం

మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి
- బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి

బడంగ్‌పేట్: మహేశ్వరం నియోజకవర్గ ప్రజలే తన బలం, బలగం అని విద్యాశాఖమంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. రూ.9 కోట్లతో నూతనంగా నిర్మించిన బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ భవనాన్ని, రూ.4.25 కోట్లతో నిర్మించిన ఉచిత ఫంక్షన్ హాల్, కుర్మల్‌గూడ వద్ద రూ.4.72 కోట్లతో నిర్మించిన డీఆర్సీని శనివారం ఆమె ప్రారంభించారు. రూ.50 కోట్లతో కార్పొరేషన్ పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనలకు శంకుస్థాపన చేశారు. బాలాపూర్ క్రాస్ రోడ్డునుంచి నాదర్‌గుల్ హైసూకల్ వరకు రూ.2.50 కోట్లతో ఏర్పాటు చేయనున్న సెంట్రల్ లైటింగ్ సిస్టం పనులకు, నాదర్‌గుల్‌లో నూతన దోబీఘాట్ నిర్మాణ పనులకు, ఎస్టీ, ఎస్సీ, బీసీ, ముదిరాజ్, గౌడ్, వైశ్య, కుమ్మరి, ఆర్మీ జవాన్ల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఒకే రోజు మొత్తం రూ.75 కోట్లకు సంబంధించిన పనులను ప్రారంభించారు. ఇప్పటికే బడంగ్‌పేటలో జిల్లా లైబ్రరీ, క్రీడా మైదానం, ఆరోగ్యకేంద్రం ప్రారంభించగా.. సమీకృత మార్కెట్, పాఠశాల నిర్మాణ పనులు, చెరువులు సుందరీకరణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా మరింత బాధ్యతగా పనిచేస్తానన్నారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధే తన లక్ష్యమన్నారు. నినాదాలు- విధానాలు రెండు కళ్లలా భావించి అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. మరోమారు తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ చిగురింత పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ సుమన్ రావు, బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ ఎస్.అర్జున్, బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దళితబంధు ఇవ్వాలని ధర్నా

- ఆకులమైలారంలో సీపీఎం నేతల ఆందోళన
- అధికార పార్టీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని ఆరోపణ

కందుకూరు: అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు దళితులతో కలిసి శనివారం ఆకులమైలారం గ్రామ పంచాపయతీ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు తమకు ఇష్టమైన వారికే దళితబంధు ఇస్తున్నారని ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా నిరుపేదలకు ముందుగా పథకం వర్తింపజేయాలని కోరారు. బతుకమ్మ చీరల పంపిణీకి అక్కడికి వచ్చిన ఎంపీడీఓ వెంకట్రాములును లబ్ధిదారులు ప్రశ్నించారు. దీనిపై ఆయన స్పందిస్తూ మండలంలో తాత్కాలికంగా దళితబంధు నిలిపివేసినట్లు తెలిపారు. దీంతో వారు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నోముల నరసింహ, కాళీదాస్, వార్డు సభ్యులు మహేందర్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆకులమైలారంలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, లబ్ధిదారులు

వంటావార్పుతో నిరసన



వంటావార్పు చేస్తున్న ఆశలు, మధ్యాహ్న భోజన కార్మికులు

కందుకూరు: తమ డిమాండ్ల సాధన కోసం ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్న విషయం విధితమే. అందులో భాగంగా శనివారం మండల కార్యాలయం ఆవరణలో వంటా వార్పు చేపట్టి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజు, ఆశ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు సరస్వతి, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు ప్రభావతి మాట్లాడారు. తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించేంత వరకు సమ్మె విరమించేది లేదన్నారు. ఇందులో ఆశలు జయసుధ, వెంకటమ్మ, లక్ష్మీదేవి, ప్రేమలత, సుజాత, రేణుక, స్వప్న, అనిత, మధ్యాహ్న భోజన కార్మికులు శ్రీను, కిషన్, గీత, మంగ, స్వప్న, సువర్ణ, అంజమ్మ, జంగమ్మ, అలివేలు ఉన్నారు.

నిరుద్యోగులకు శాపంగా.. బీఆర్‌ఎస్

- ప్రభుత్వాన్ని గద్దె దింపితేనే కొలువులు
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములుయాదవ్



పార్టీలో చేరిన వారితో అందెల శ్రీరాములుయాదవ్ తదితరులు

కందుకూరు: బీఆర్‌ఎస్ సర్కార్ నిరుద్యోగులకు శాపంగా మారిందని, ఆ ప్రభుత్వాన్ని గద్దె దింపితేనే ఉద్యోగాలు వస్తాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. శనివారం పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో బేగంపేటకు చెందిన పలువురు బీజేపీలో చేరగా.. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శిలాఫలకాల ఏర్పాటు ఆర్భాటం కాదని, యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ ఆన్‌లైన్ అప్లికేషన్లు తప్పుల తడకగా ఉన్నా.. మంత్రి సబితారెడ్డి పట్టించు కోవటం లేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరటం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. పార్టీలోకి వచ్చే వారికి సముచిత స్థానం కల్పిస్తామని, పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీలు మల్లేశ్, బాల్‌రాజ్, డైరెక్టర్ పర్వతాలు, నాయకులు సత్తయ్య, రవి, హరిబాబు, శ్రీనివాస్, కరుణాకర్, అమరేందర్‌సాగర్, జంగయ్య, దేవానాయక్, సహాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైక్లోథాన్ 10కె

బడంగ్‌పేట్: పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ కీసర ఆధ్వర్యంలో విద్యార్థులకు సైక్లోథాన్–5కె, 10కె సైకిలింగ్ పోటీలను శనివారం చేపట్టగా.. డైరెక్టర్ సుశీల్‌కుమార్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో పాఠశాలకు చెందిన సుమారు 5 వందల మంది విద్యార్థులు, ఆసక్తి కలిగిన యువకులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి నగదు బహుమతిని అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మారుతున్న జీవనశైలికి వ్యాయామం ఎంతో ముఖ్యమన్నారు. యోగా చేయడం వలన శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత పొందవచ్చని పేర్కొన్నారు. ఇందులో కల్నల్ సంజయ్, ప్రముఖ వైద్యురాలు నవ్య, మిస్టర్ తెలంగాణ బాడీ బిల్డర్ వాహిద్, ప్రిన్సిపాల్ గ్రెసిల్డా రోజ్, ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సైక్లోథాన్ 10కెలో పాల్గొన్న విద్యార్థులు

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

జెడ్పీటీసీ నిత్య



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ తదితరులు

మంచాల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పెట్టుకున్నామని జెడ్పీటీసీ నిత్య ప్రకటించారు. శనివారం మంచాల గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచాల మండల అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు. ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహాకారంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేశామన్నారు. మంచాల గ్రామంలో డ్వాక్రా భవనం నిర్మాణం కోసం జిల్లా పరిషత్ నుంచి రూ.10లక్షలు, పీడీఎఫ్ నిధులు, ఎమ్మెల్యే సహాకారంతో మరో రూ.10లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జగన్‌రెడ్డి, ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, వార్డు సభ్యులు, డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలతో ఎమ్మెల్యే బిజీ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సుమారు రూ. 3.5 కోట్ల నిధులతో చేపట్టిన, చేపట్టబోయె పనులకు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి శనివారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాయపోల్ గ్రామంలో రూ. 50 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అదేవిధంగా రూ.15 లక్షలతో నిర్మించనున్న బ్రిడ్జి, రూ. 10 లక్షలతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ముకునూర్ గ్రామంలో రూ. 55.20 లక్షలతో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్, రైతు వేదిక కంపౌండ్ వాల్, దండుమైలారంలో రూ. 30 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం, నెర్రపల్లి గ్రామంలో రూ. 22 లక్షలతో సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్, నిర్మాణానికి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన ఎమ్మెల్యే చేశారు. అనంతరం బతుకమ్మ చీరలను, క్రీడాకారులకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



పంచాయతీ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తదితరులు

కానిస్టేబుల్ ఉద్యోగానికి ఆరుగురు అనాథ గృహం విద్యార్థులు

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవల నిర్వహించిన ప్రిలిమ్స్, ఫిజికల్ టెస్ట్, మెయిన్స్ పరీక్షల ఫైనల్ ఫలితాల్లో ఆర్‌కేపురం డివిజన్ చిత్రా లే అవుట్‌లోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులు ఆరుగురు కానిస్టేబుల్స్‌గా ఎన్నికయ్యారు. గృహంలో చదువుకుంటున్న ప్రశాంత్, శివలింగం, నర్సిరెడ్డి–ఏఆర్ (ఆరడ్మ్ రిజర్వ్) విభాగంలో, హరీష్ అగ్నిమాపక శాఖలో, సాయినాథ్–సివిల్ డిపార్ట్‌మెంట్‌లో, నిరంజన్ –పోలీస్ టాన్స్ పోర్ట్ విభాగంలో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అనాథ గృహంలో శనివారం గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్యవైశ్యులు రాజకీయంగా రాణించాలి

హస్తినాపురం: సమాజంలో ఆర్యవైశ్యులకు మంచి గుర్తింపు ఉందని, వారి అభ్యున్నతికి శాయశక్తులా కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం హస్తినాపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నీలా మధుసూదన్‌గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని, అందుకోసం తన పూర్తి సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో కాసుల శ్రీనివాస్‌గుప్తా, శివ యాదగిరి, సారపు రవికుమార్, సుధాకర్‌గుప్తా, ఆంజనేయులు గుప్తా పాల్గొన్నారు.

పల్లెలకు, తండాలకు స్వచ్ఛమైన తాగునీరు

- బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించండి
- కేసీఆర్ కృషితో మిషన్ భగీరథ పథకానికి రూపకల్పన
- ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



మిషన్ భగీరథ నీటి ట్యాంకును ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

కడ్తాల్: మిషన్ భగీరథ పథకం ద్వారా, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పల్లెకు, తండాకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా జరుగుతుందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు రాములు, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని సాయి రాంనగర్ కాలనీలో రూ.42లక్షలతో నిర్మించిన మిషన్ భగీరథ నీటి ట్యాంకును శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తాగునీటి కోసం మహిళలు అనేక ఇక్కట్లకు గురయ్యేవారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక సీఎం కేసీఆర్ ప్రత్యేక కృషితో మిషన్ భగీరథ పథకానికి రూపకల్పన చేసి, గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించారని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తోందని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఆశీర్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వె వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబ, అర్జున్‌రావు, వీరయ్య, నర్సింహ, మహేశ్, నర్సింహగౌడ్, డీఈ మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పనుల్లో వేగాన్ని పెంచండి

యాచారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. ఎంపీడీఓ సమావేశం హాల్‌లో శనివారం వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఎప్పుడైనా వచ్చే అవకాశం ఉందని, త్వరగా పనులు చేయాలని సూచించారు. గ్రామాల్లో విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని, సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకునే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. డ్రైనేజీ కాల్వలు, తాగునీటి పైపులు లీకేజీలు కాకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఈజీఎస్ ఏపీఓ లింగయ్య పాల్గొన్నారు.

ఆశల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్

ఇబ్రహీంపట్నం: ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్ డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా శనివారం ఇబ్రహీంపట్నంలో నిరహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ ఆశలకు కనీస వేతనం రూ. 18 వేలు, ప్రమాదబీమా రూ. 5లక్షలు, పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని, లేనిపక్షంలో సోమవారం చలో హెల్త్ కమిషనర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, నాయకులు బుగ్గరాములు, ఎల్లేశ్, మరియమ్మ, చంద్రకళ, సుకన్య, మణెమ్మ, లావణ్య, లలిత, ముక్తాబాయ్, స్వరూప, బాలమణిలు తదితరులు పాల్గొన్నారు.